# ఏసీబీ వలలో ఎస్సై, పశువైద్యాధికారి

2లో.



తెలంగాణ ఏసీబీ అవినీతి అధికారులపై కొరడా ఝుళిపిస్తుంది. తాజాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఏజెన్సీ శ్యాంపూర్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రమేష్ రాథోడ్ లంచం తీసుకంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.


తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT

THE LARGEST TELUGU DAILY NEWS PAPER

ఎడిటర్: బక్క రవీందర్ సంపుటి:1 . సంచిక 175 గురువారం , 30-01-2025

Hyderabad · Rangareddy · Mahaboob Nagar · Medak · Karimnagar · Warangal · Khammam · Nalgonda. Adilabad. Nizamabad.




### వరుస ఘటనలు సిగ్గుచేటు: హరీశ్ రావు

మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు ఆసుపత్రిపాలు కావడం సర్కారు నిర్లక్ష్యానికి నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు.. నిత్యకృత్యమవుతున్నా ప్రభుత్వం లో చలనం లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలు చేపట్టడంలేదని, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలయ్యాయని హరీశ్‌రావు విమర్శించారు.

### కుంభమేళా తొక్కిసలాట ఘటనలో 30కి పెరిగిన మృతుల సంఖ్య

అధికారికంగా ప్రకటించిన యూపీ పోలీసులు. 36 మందికి గాయాలు.. ఆసుపత్రిలో చికిత్స. 30 మంది మృతుల్లో 25 మందిని గుర్తించిన అధికారులు. బారికేడ్లు ధ్వంసం కావడం వల్లే తొక్కిసలాట. మౌని అమావాస్య సందర్భంగా ఇవాళ వీఐపీ ప్రోటోకాల్ రద్దు చేశాం. -యూపీ డీఐజీ

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



### జగన్ విధ్వంసం బయటపడింది

> జాతీయ సర్వే సంస్థ అసర్ నివేదికతో జగన్ విధ్వంసం బయటపడింది. విద్యా వ్యవస్థలో జగన్ విధ్వంసం బట్టబయలైంది. విద్యాప్రమాణాలు పెంచే కనీస చర్యలు తీసుకోలేదని తేటతెల్లమైంది. అనేక అంశాలు గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ఎండగడుతున్నాయి. -మంత్రి నారా లోకేశ్

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



### 2001లోనే నేను భూములు కొనుగోలు చేశాను

> కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో రెవెన్యూ అధికారులు మా భూములను సర్వే చేశారు. నేను ఇసుక దందా చేసి 40 వేల కోట్లు దోచేశానని గతంలో పవన్ ఆరోపించారు. మరి నాపై ఎందుకు చర్యలు తీసుకోలేదు..?- మాజీ మంత్రి పెద్దిరెడ్డి

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



### యాదగిరిగుట్ట ఆలయ సమీపంలో రాజకీయాలకు తావులేకుండా అవసరమైన చర్యలు

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం పాలక మండలి ఏర్పాటు విషయంలో టీటీడీ తరహాలో విధివిధానాలు రూపొందించి తొందరగా చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. యాదగిరిగుట్టకు ధర్మకర్తల మండలి ఏర్పాటుకు అధికారులు రూపొందించిన ముసాయిదాలో పలు మార్పులను సూచించారు

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:



## ప్రధాన వార్తలు

### ఎంతో బాధాకరం కుంభమేళా తొక్కిసలాటపై యోగీకి మోదీ ఫోన్



మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ఎంతో బాధాకరమని ప్రధాని మోదీ అన్నారు. బాధితులకు ప్రయాగ్‌రాజ్‌లోని స్థానిక యంత్రాంగం అన్ని విధాల సహాయం చేస్తోందని ఆయన తెలిపారు. బాఽధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:


### ఢిల్లీలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల




ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తే కులగణన అమలు చేస్తామని, పూర్వాంచలీలకు ప్రత్యేకంగా ఓ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని, చదువుకున్న నిరుద్యోగ యువతకు ఏడాది పాటు నెలకు రూ.8,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. అలాగే, మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తామని, కుటుంబానికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని, ఉచిత రేషన్ కిట్లు కూడా పంపిణీ చేస్తామని, ఢిల్లీ నగరంలో 100 ఇందిరా క్యాంటీన్లు ఏర్పాటు చేసి, రూ.5కే భోజనం అందిస్తామని, యమునా నదికి ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:


### ట్రిపుల్ తలాక్ ఎఫ్ఐఆర్‌ల వివరాలివ్వండి! కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం



ట్రిపుల్ తలాక్ చెప్పి భార్యకు విడాకులు ఇవ్వటానికి ప్రయత్నించిన వ్యక్తుల మీద దాఖలైన ఎఫ్ఐఆర్, చార్జిషీట్ల వివరాలను తమకు అందజేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2019లో వచ్చిన 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం' ట్రిపుల్ తలాక్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. అయితే, ట్రిపుల్ తలాక్ చెప్పటాన్ని ఈ చట్టం నేరంగా పరిగణించి, ఆ నేరానికి పాల్పడిన వారికి మూడేళ్ల జైలు శిక్షను విధిస్తుంది. దీనిని వ్యతిరేకిస్తూ పలు ముస్లిం సంఘాలు, వ్యక్తులు సుప్రీంకోర్టులో 12 పిటిషన్లు దాఖలు చేశాయి.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

### నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ–ఎఫ్15



ఇస్రో మహాద్భుత విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం.. షార్‌లో వందో మిషన్.. విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదికపై నుంచి బుధవారం ఉదయం 6:23 గంటలకు ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయింది. 27:30 గంటల కౌంట్‌డౌన్ ముగియగానే రెండోతరం నావిగేషన్ ఉపగ్రహం ఎన్వీఎస్–02 (నావిక్–02)ను తీసుకుని నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన రాకెట్.. మూడు దశలను నిరాటంకంగా పూర్తిచేసుకుని 19.12 నిమిషాల్లోనే దాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్.. జీఎస్ఎల్వీ–ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు.

డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:

# పంచాయతీ ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు తేలాకే!

**డైలీ రిపోర్ట్, న్యూస్ డెస్క్:**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లు తేలిన తరువాతే జరగనున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల సర్వే వివరాల ముసాయిదా మరో రెండు రోజుల్లో ప్రభుత్వానికి అందనుంది. అనంతరం పూర్తి నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి ఫిబ్రవరి 2 నాటికి అధికారులు అందజేయనున్నారు. ఆ వెంటనే సబ్‌కమిటీ సమావేశమై.. నివేదికపై చర్చిస్తుంది. ఆపై రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయి.. బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించి, నిర్ణయం తీసుకుంటుంది. అనంతరం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటుచేసి బీసీల రిజర్వేషన్లపై తీర్మానం చేసి కేంద్రానికి పంపనున్నారు. దీనిపై కేంద్రం నుంచి సమాధానం వచ్చిన తరువాత రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల్లోనే 2024 ఫిబ్రవరిలోకులగణనకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వేలో వచ్చిన వివరాల ఆధారంగా రాష్ట్రంలో బీసీల లెక్కలు తేలనున్నాయి. కాగా, బీసీలకు ఖరారు చేయాల్సిన రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను కూడా నియమించింది. కుల సర్వేలో వచ్చిన వివరాలను ఇచ్చిన అనంతరం.. రిజర్వేషన్లను సూచిస్తూ ప్రత్యేక కమిషన్ ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తుంది.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి



లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ మాధురి

గురుకుల పాఠశాల విద్యార్థులకు తమ అనుభవాలను తెలిపిన కలెక్టర్ ,అదనపు కలెక్టర్.

ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల / కళాశాలలో రాత్రి బస చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో /పటాన్ చెరువు జనవరి 29 (డైలీ రిపోర్ట్):**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు ,అదనపు కలెక్టర్ మాధురితో కలిసి ఇస్నాపూర్ లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిరువురు విద్యార్థులకు, తమ విద్యాభ్యాసం , తాము ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని ఎలా చేరుకున్నది వివరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని ఆ లక్ష సాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. కలెక్టర్ క్రాంతి వల్లూరు తను ఇంటర్ చదివే సమయం నుండే ఐఐటీలో సీటు సాధన కోసం శ్రమించానని తెలిపారు. మాథ్స్ కెమిస్ట్రీలో అత్యధిక శాతం మార్కులు రావడంతో జేఈఈ ఎంట్రన్స్ లో 938 ర్యాంకు రావడంతో ఢిల్లీ ఐఐటీలో సీటు వచ్చినట్లు అనంతరం కుటుంబ సభ్యులు బంధువుల సూచన మేరకు ఐఏఎస్ కు ప్రిపేర్ కావడం ఐఏఎస్ లో ర్యాంకు వస్తే ఎంతోమంది ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందన్న ఉద్దేశంతో ఐఏఎస్ సాధన కోసం శ్రమించినట్లు కలెక్టర్ తెలిపారు. సివిల్స్ పరీక్షలో ర్యాంకు సాధించడం కోసం తాను శ్రమించిన విధానం విద్యార్థులకు తెలిపారు. అదనపు కలెక్టర్ మాధురి తాను పెళ్లి అయిన తర్వాత కష్టపడి చదివి ప్రభుత్వ గ్రూప్ 1, ఉద్యోగం సాధించిన తీరును వివరించారు. తాను ఒకవైపు సాఫ్ట్వేర్ కంపెనీలో పనిచేస్తూ ఎలాంటి కోచింగ్ లేకుండానే ఇంటివద్దె పిల్లలను చూసుకుంటూ గ్రూప్ వన్ ఉద్యోగం సాధించిన తీరును అదనపు కలెక్టర్ వివరించారు. విద్యార్థి దశలో కష్టపడి చదువుతూ అనుకున్న ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చని వారు విద్యార్థులకు వివరించారు.చదువు బాలికలకు మహిళలకు చాలా ఏమైనా అవసరం అని  అన్నారు. కష్టాలను ఎదుర్కొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి.ఈ కళాశాలలో రైజిలింగ్ అకాడమీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంచి శిక్షణ పొంది రాష్ట్ర జాతీయస్థాయి లో రాణించాలని ఆశ భావం వ్యక్తం చేశారు.అనంతరం వారిరువురు గురుకుల పాఠశాల లో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ను స్టోర్ రూమ్ను పరిశీలించారు.  విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ విద్యార్థుల ఎదుగుదల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల సలహాలు పాటించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు భవిష్యత్తులో విద్యార్థులు ఏఏ కోర్సులు చదివితే ఎలాంటి ఉపాధి అవకాశాలు ఉంటాయో విద్యార్థులు ఇప్పటి నుండి అవగాహన కల్పించుకోవాలని అన్నారు. వివిధ కోర్సులు ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా వివిధ కార్యక్రమా నిర్వహించాలని ఉపాధ్యాయ బృందానికి కలెక్టర్ సూచించారు . అనంతరం కలెక్టర్ అదనపు కలెక్టర్లు విద్యార్థులతో కలిసి కలిసి నిద్రించారు .ఈ సందర్భంగా విద్యార్థులతో, అధ్యాపకు బృందం ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు త్వరలో వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.